క్లుప్తంగా

ప్రతిఒక్కరూ పన్నులు చెల్లించాలి



మరికల్ గ్రామంలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని మరికల్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం మరికల్ గ్రామపంచాయతీలో ఇంటిపన్నుల వసూలును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ కుటుంబం విధిగా ఇంటి పన్నులు, దుకాణదారులు తమ లైసెన్సుల ఫీజులు విధిగా చెల్లించాలన్నారు. అందరూ పన్నులు సకాలంలో చెల్లిస్తే గ్రామంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించొచ్చన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కామునిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసనం నిర్వహిస్తున్న సిబ్బంది

కుల్కచర్ల: చిన్నారులు ప్రీ ప్రైమరీ విద్యకోసం అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ, కామునిపల్లి అంగన్‌వాడీ టీచర్ పండరీబాయి పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండలం కామునిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసనం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదమ్మ మాట్లాడుతూ.. చిన్నారులకు ఏ సమయంలో ఎలాంటి పోషకాహారం అందించాలో వైద్య సిబ్బంది సలహా, సూచనల మేరకు అందజేస్తున్నామన్నారు. పిల్లలకు ప్రాథమిక అక్షరాల గుర్తింపు తదితర ప్రీ ప్రైమరీ విద్యను అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉపయోగకరంగా పనిచేస్తాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామునిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, ఆశ కార్యకర్త బాలమణి, ఉపాధ్యాయులు రజిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్



చలివేంద్రం ప్రారంభిస్తున్న డాక్టర్ రవీంద్రయాదవ్ తదితరులు

కొడంగల్ రూరల్: బాటసారుల దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ముందు అమ్మా-నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పెరుగుతున్న ఎండలకు చలివేంద్రాలు కొంతమేర ఉపశమనం కలిగిస్తాయన్నారు. చలివేంద్రాలు ఏర్పాటుచేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్‌గుప్తా, కోట్రికె లక్ష్మీనారాయణగుప్తా, నరేష్‌రాజ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక



ఆలంపల్లి రవికి నియామక పత్రం అందజేస్తున్న మాన్‌సింగ్

ధారూరు: ధారూరు మండల పరిధిలోని మోమిన్‌ఖుర్దు, మోమిన్‌కలాన్ గ్రామాల్లో బుధవారం కాగ్రెస్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోమిన్‌కలాన్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఆలంపల్లి రవి, ఉపాధ్యక్షుడిగా షఫీ, మోమిన్‌ఖుర్దు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పామిని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సీమన్, కార్యదర్శిగా కె. వీరేందర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ధారూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ అశోక్ ముదిరాజ్, మాజీ జెడ్పీటీసీ రాములు, కాంగ్రెస్ నాయకులు రమేశ్‌కృష్ణ, అవినాశ్‌రెడ్డి, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే రామలింగేశ్వరుడు

- పుణ్యక్షేత్రంగా దామగుండం
- పుష్కరిణిలో స్నానమాచరిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం
- 23నుంచి బ్రహ్మోత్సవాలు

పూడూరు: మండల పరిధిలోని దామగుండ రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తులు దామగుండం ఆలయాన్ని దర్శిస్తే సకల శుభాలు కలగడమే కాకుండా ఇక్కడి పుష్కరిణిలో స్నానమాచరిస్తే కష్టాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. చుట్టూ కొండలు పచ్చని చెట్ల మధ్య పకృతి రమణీయతతో ఉట్టిపడే ఆహ్లాదకరమైన వాతావరణం, దట్టమైన అడవిలో కొలువుదీరిన రామలింగేశ్వరుడిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల భక్తులే కాక, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. వికారాబాద్ జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన దామగుండ రామలింగేశ్వర స్వామి ఆలయం హైదరాబాద్–బీజాపూర్ రహదారి నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. 500ల యేళ్ల చరిత్రగల ఈ దేవాలయం దట్టమైన అడవి, కొండల మధ్య విస్తరించి ఉంది. ఆలయం చుట్టూ ఉన్న పచ్చని చెట్లు, పక్షుల కిలకిలరావాల మధ్య దామగుండ రామలింగేశ్వరుడు కొలువుదీరి భక్తుల కోర్కెలు తీరుస్తున్నాడు. కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా వెలుగొందుతున్నాడు. దీంతో దామగుండ రామలింగేశ్వరుడిని భక్తులు ఎక్కువగా కొలుస్తున్నారు. ఇక్కడి లింగమూర్తిని స్వయానా శ్రీరామ చంద్రుడే ప్రతిష్ఠించాడని పురాణాలు చెబుతున్నాయి.

ఆలయ చరిత్ర

దామగుండ రామలింగేశ్వర స్వామి ఆలయానికి 500 యేళ్ల చరిత్ర ఉంది. పూర్వం దాముడు, గుండడు అనే ఇద్దరు అన్నదమ్ములు ఈ ప్రాంతంలో వ్యవసాయం చేస్తుండేవారు. నాగలిపై బరువు ఉంచడం కోసం ఒక రాయిని పెట్టి పొలాన్ని దున్నేవారు. సాయంత్రం నాగలిపై రాయిని అలాగే వదిలి వెళ్లేవారు. ఉదయం వచ్చి చూసే సరికి నాగలిపై ఉన్న రాయి యథాస్థితికి చేరేది. ఇలా రెండు మూడు రోజులు జరిగింది. ఈ విషయాన్ని గమనించిన వారు ఈ ప్రాంతంలో ఏదో శక్తి ఉందని తెలుసుకున్నారు. దీంతో అక్కడ ఒక మునీశ్వరుడు ప్రత్యక్షమై ఈ రాయి స్వాక్షాత్తు రామలింగేశ్వరుడని వారికి వివరించాడు. రాయి ఉన్న ప్రాంతంలోనే రాయిని ప్రతిష్ఠించి పూజించారు. దాముడు గుండుడు ప్రతిష్ఠించిన ఈ ప్రాంతానికి వారిపేరిట దామగుండంగా వెలుగొందుతుందని పూర్వికుల నమ్మకం.



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయ పుష్కరిణి

దామగుండం చేరుకోవాలంటే..

ఈ పుణ్యక్షేత్రానికి చేరుకోవాలంటే..హైదరాబాద్ బీజాపూర్ ప్రధాన రోడ్డుపై నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వికారాబాద్ నుంచి వెంకటాపూర్ తండా మీదుగా, గుడుపల్లి గ్రామం నుంచి దామగుండ పుణ్యక్షేత్రానికి రోడ్డు సౌకర్యం ఉంది. దామగుండం క్షేత్రం మీదుగా ప్రైవేటు వాహనాలు తిరుగుతాయి. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా ఆటోలను నడుపుతారు.



ఆలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడు

ఉత్సవాలు ఇలా..

ఈ నెల 23 నుంచి దామగుండ రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 23న ఆదివారం అఖండదీపారాదన, ధ్వజారోహనం, 24 సోమవారం తెల్లవారు ఝామున అగ్నిగుండం, రుద్రాభిషేకం, పార్వతి రామలింగేశ్వరుల కల్యాణం, రాత్రి 10 గంటలకు రథోత్సవం, 25 మంగళవారం సహస్రబిల్వార్చన, రాత్రి దీపోత్సవం, 26 బుధవారం రుద్రాభిషేకం, సహస్ర పుష్పార్చన, 27 గురువారం రుద్రాభిషేకం, చక్రతీర్థం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ పూజారులు భీమాచార్యులు, రఘురామాచారి, సేతుమాచారి, నర్సింహాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

తాగునీటి ఇబ్బందులు రానియ్యం

ఎంపీడీఓ గ్యామా

దోమ: గ్రామాల్లో త్రాగు నీటి ఇబ్బందులు రాకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ గ్యామా సూచించారు. బుధవారం దోమ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ కార్యదర్శి గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి కూలీకి 100 రోజుల పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ దస్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో మధ్యాహ్న భోజనం పరిశీలన

మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం వడ్డించాలని కస్తూర్బాగాంధీ ఎస్‌ఓ చైతన్యకు ఎంపీడీఓ గ్యామా సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను ఎంఈఓ వెంకట్‌తో కలిసి సందర్శించారు. స్టోర్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ గ్యామా

రైతు భరోసా డబ్బులు రావా సారూ?

పూడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న రైతు భరోసా డబ్బులు అధికారుల నిర్లక్ష్యం మూలంగా రైతుల పాలిటశాపంగా మారింది. సంబంధిత రైతు కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకునేవారు కరువయ్యారు. వివరాల్లోకెళితే.. పూడూరు మండల పరిధిలోని మేడికొండ గ్రామానికి చెందిన మొగులయ్య తనకున్న రెండెకరాలకు రైతు భరోసా జమకాలేదని బుధవారం వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి వచ్చాడు. కాళ్లకు చెప్పులు లేవు..ఎండలో తన కూతురు సహాయంతో అక్కడికి వచ్చినా పట్టించుకోలేదని మొరపెట్టుకున్నాడు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పుకోవాలి సారూ అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక నాకు రైతు భరోస డబ్బులు రావా.. సారూ...అంటూ కనబడిన అధికారులకు తన గోడును వెళ్లబోసుకున్నాడు.



వ్యవసాయ అధికారి కార్యాలయం ఎదుట కూర్చున్న రైతు

విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న మండల విద్యాధికారి రాంరెడ్డి

మండల విద్యాధికారి రాంరెడ్డి

కొడంగల్ రూరల్: విద్యార్థులు లక్ష్యం ఎంచుకొని చదువుకోవాలని మండల విద్యాధికారి రాంరెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. విద్యార్థి దశ ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కెసి.వెంకటేశ్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

మండల పరిధిలోని పెద్దనందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థి న్యాయవాది రమేశ్ పాఠశాలకు ఫ్యాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: పదోతరగతి పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు వ్రాయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పదోతరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హబీబ్ అహ్మద్, కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దోమ: మాట్లాడుతున్న ఎంపీడీఓ గ్యామా

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

దోమ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ గ్యామా సూచించారు. బుధవారం దోమ మండల పరిధిలోని బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంఈఓ వెంకట్‌తో కలిసి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదువుకొని రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షఫీ, ఉపాధ్యాయులు ముత్యప్ప, అనంతయ్య, రుక్మిణీ, మాధురి, సరస్వతి, స్వరుప, నరేందర్, మల్లేశం, జంగయ్య, ఖయ్యుం, ప్రవీణ్, విజయసాయి, సీఆర్‌పీ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి

పూడూరు: విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్‌లో రాణించాలని పాఠశాల హెచ్‌ఎం అబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం ఎఫ్‌ఎల్‌ఎన్ పురస్కారాల్లో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కంకల్ కాంప్లెక్స్ పరిధిలోని తొమ్మిది పాఠశాలల విద్యార్థులకు సోమన్‌గుర్తి పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంకల్ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. అనంతరం క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రేరణ పురస్కార సర్టిపికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ మెంటర్‌లు నవీన్, రాకేష్, అఖిల, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



సోమన్‌గుర్తి పాఠశాలలో సర్టిపికెట్‌లు అందజేస్తున్న హెచ్‌ఎం అబ్బయ్య

వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి

కుల్కచర్ల: ధాన్యం అమ్మకాలు, కొనుగోలు ప్రక్రియను నిర్వహించే వ్యాపారులందరూ తప్పనిసరిగా మార్కెట్ ట్రేడ్ లైసెన్సులను తీసుకోవాలని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్, మరికల్ గ్రామాల్లోని ధాన్యం క్రయ, విక్రయదారులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లైసెన్సులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సూపర్‌వైజర్లు రాములు, సిద్ధయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీశ్‌రెడ్డి

పూడూరు: కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పూడూరు పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించిన సందర్భంగా బుధవారం మండల పరిధిలోని మన్నెగూడ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిల చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. రూ. 6వేల కోట్లతో యువత కోసం రాజీవ్ యువ వికాసం ప్రారంభించి నిరుద్యోగ యువతకు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పట్లోళ్ల రఘునాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్, డీసీసీ కార్యదర్శి శ్రీనివాస్, మహిళా నాయకురాలు బాలమణి, నాయకులు నర్సింహారెడ్డి, అబ్రహం, క్రిష్ణ, నర్సింలు, లక్ష్మణ్, శంకర్, నారాయణ, సత్తార్, రఘురాంరెడ్డి, రాములు, నరేష్‌కుమార్, సురేందర్, మోహిన్, సల్మాన్, సద్దాం, శ్రీకాంత్, ఆరిఫ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం కాంగ్రెస్ నాయకులు, దళిత సంఘాల నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను ఆమోదించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రచార కార్యదర్శి ఎస్ సోమశేఖర్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము, నాయకులు దస్తప్ప, కమ్మరి సాయిలు, అశోక్, ప్రకాష్, శ్రీను, లక్ష్మప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పూడూరు: మన్నెగూడలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

లేబర్‌కార్డు తీసుకోవాలి

దౌల్తాబాద్: భవన నిర్మాణ కార్మికులు తప్పనిసరిగా లేబర్‌కార్డు తీసుకోవాలని అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం చల్లాపూర్ గ్రామంలోని భవన నిర్మాణ కార్మికులకు లేబర్‌కార్డులు అందజేశారు. లేబర్‌కార్డు వల్ల కార్మికులకు ఎన్నో ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. లేబర్ కార్డు కలిగిన కార్మికులు అనారోగ్యంతో మృతిచెందితే ప్రభుత్వం రూ.1.30లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6.30లక్షలు పరిహారం అందజేస్తుందన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ లేబర్‌కార్డు తీసుకొని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి పులిందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

దౌల్తాబాద్: నిర్మల్ జిల్లాలో రెవెన్యూ కార్యాలయంలో విధి నిర్వహణలో ఉన్న తానూరు రెవెన్యూ ఉద్యోగిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు అయూబ్ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులపై దాడి సమంజసం కాదన్నారు. దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు రఫీక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్

దుద్యాల్: ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను బుధవారం గాంధీ భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ ఇటీవలే ఎన్నికైన ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు.

విద్యార్థులు భయం వీడాలి

మోమిన్‌పేట: విద్యార్థులు భయం వీడి పరీక్షలకు సన్నద్ధం కావాలని మోటివేటర్ డాక్టర్ మహేందర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మేకవనంపల్లి ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భయపడుతూ పరీక్షలు రాస్తే ఫలితం శూన్యమన్నారు. విద్యార్థులు ఏకాగ్రత్తతో పరీక్షలు రాయాలన్నారు. ఎట్టి పరిస్థితిలో ఒత్తిడికి లోనుకావద్దన్నారు. విద్యార్థులు లక్ష్యం ఎంచుకొని చదువుకోవాలని ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, ఎంఈఓ మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు గౌరిశంకర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మేకవనంపల్లి ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశంలో హాజరైన అతిథులు

సబ్బండ వర్గాలు హర్షించేలా బడ్జెట్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: సబ్బండ వర్గాలు హర్షించేలా తెలంగాణ బడ్జెట్ రూపొందించబడిందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని గతంలో చేసిన అప్పుల నుంచి బయటపడి తెలంగాణ యువతకు ఉత్తమమైన భవిష్యత్ అందించాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకుసాగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని అటువంటి ప్రభుత్వంలో అందరూ మెచ్చే బడ్జెట్‌ను భట్టి విక్రమార్క ప్రవేశపెట్టడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ ఆనందం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్, డైరెక్టర్లు ఎల్లయ్య, భరత్‌కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ భాను, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు రూరల్: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని గ్రామ అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు గూడెపు శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద కుర్వ నర్సిములు ప్లాట్ నుంచి ఎరుకలి రాములు ఇంటి వరకు సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తాండూరు మండలంలోని చెన్‌గేస్‌పూర్ గ్రామం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషితో గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా గ్రామంలో 144 మందికి ఇందిరమ్మ ఇళ్లు కూడా మం జూరయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుర్వ మల్లయ్య, గోవింద్‌రాజుగౌడ్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.



తాండూరు రూరల్: చెన్‌గేస్‌పూర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని దుర్గంచెర్వు గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి రూ.30లక్షలు, ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం 15మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే అభివృద్ధికి పెద్దెత్తున నిధులు కేటాయిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు సుభాష్‌గౌడ్, మాణయ్య, వెంకటేశం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: దుర్గంచెర్వులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండలంలోని ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి కృషి చేస్తున్నారని మండల అధ్యక్షుడు వెంకట్రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కౌడీడ్-నందారం వరకు ఉన్న మెటల్‌రోడ్డును బీటీగా మార్చడానికి నిధులు మంజూరయ్యాయని వాటి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ కొడంగల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి ఐదేళ్లకాలంలో ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సిములు, రాజశేఖర్‌రెడ్డి, రెడ్యానాయక్, నర్సప్ప, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.